# పాతబస్తీలో ప్రశాంతంగా ఎన్నికలు

- మలక్‌పేటలో.. 39 శాతం
- యాకుత్‌పురాలో.. 27.87 శాతం
- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- ఓటు హక్కు వినియోగించుకున్న నేతలు
- గల్లంతైన ఓట్లు.. ఇబ్బందులు పడ్డ జనాలు



అక్బర్‌బాగ్ ఆనంద్‌నగర్ కమ్యూనిటీ హాల్ బస్తీదవాఖాన ఓటింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు

సైదాబాద్, నవంబర్ 30 : మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలు స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. ఓటింగ్ శాతం తగ్గటంతో నాయకుల మధ్య టెన్షన్ పెరిగింది. ఉదయం చలిగాలులు వీయటంతో చాలామంది ఓటర్లు ఇండ్ల నుంచి బయటకు రావడానికి సహసించలేదు. దీంతో మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో ఆశించిన స్థాయిలో పోలింగ్ జరగలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు లేక ఖాళీగా దర్శనమిచ్చాయి. పోలింగ్ ముగిసే సమయంలో జనం భారీగా తరలిరావడంతో మలక్‌పేటలో 39 శాతం, యాకుత్‌పురాలో 27.87 శాతంగా పోలింగ్ నమోదైంది.

### పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు...

రెండు నియోజకవర్గాల పరిధిలో పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం మిషన్లు మొరాయించాయి. దీంతో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో వారు వెంటనే మిషన్లను సరిచేసి సమస్యలను తొలగించారు. మిషన్లు మొరాయించినంత సేపు ఓటర్లు పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్వల్ప సంఘటనలు మినహాయించి పోలీసు భద్రత మధ్య పౌరులంతా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు.

### గల్లంతైన ఓట్లు..

యాకుత్‌పురా, మలక్‌పేట నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఓటర్ల పేర్లు గల్లంతు కావడంతో వారంతా నిరాశతో వెనుదిరిగారు. ఓటు వేయటానికి ఓటరు కార్డులను తీసుకుని ఆసక్తితో వచ్చిన ఓటర్లకు లిస్టులో పేర్లు కన్పించకపోవటంతో అనేకమంది నిరాశతో వెనుదిరిగిపోయారు.



ఐఎస్ సదన్‌లో ఓటు వేసిన బీఆర్‌ఎస్ యాకత్‌పురా అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి, ఆయన సతీమణి స్వప్నాసుందర్‌రెడ్డి

### 300 కేంద్రాల్లో ఓటింగ్..

మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని 7 మున్సిపల్ డివిజన్ల పరిధిలో మొత్తం 300 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓటర్లు 3, 17,866 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,60, 880 మంది, మహిళలు 1,56,972 మంది, ఇతరులు 14 మంది ఉన్నారు. ఎన్నికల కోసం ప్రత్యేక మహిళా పోలింగ్ కేంద్రాలు–5, యువతీ యువకుల కోసం 5, దివ్యాంగ ఓటర్ల కోసం–1 కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా యాకుత్‌పురా నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓటర్లు 3,46,428 మంది ఉండగా, అందులో పురుషులు, 1,75,849 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 28 మంది ఓటర్లు ఉండగా, 314 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.



సైదాబాద్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, తదితరులు

### ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

బీఆర్‌ఎస్ యాకుత్‌పురా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఐఎస్ సదన్ డివిజన్ ప్రెస్ కాలనీలోని ఓటింగ్ కేంద్రంలో తన సతీమణి సామ స్వప్నాసుందర్ రెడ్డితో కలిసి ఓటు వేశారు. అదేవిధంగా వాణీనగర్ కాలనీలో బీజేపీ అభ్యర్థి ఎన్. వీరేంద్రబాబు యాదవ్ తన సతీమణి, మాతృమూర్తితో కలిసి ఓటు వేశారు.

## మలక్‌పేటలో ఓటేసిన ప్రముఖులు



కిడ్‌జీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసినట్లు చూపుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

చాదర్‌ఘాట్, నవంబర్ 30: మలక్‌పేట నియోజకవర్గంలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు చాలా కీలకమైనవని, ఓటు ద్వారానే ప్రభుత్వాలు ఏర్పడుతాయని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. గురువారం నియోజకవర్గం పరిధిలోని ఆజంపురా డివిజన్‌లోని కిడ్‌జీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో హోంమంత్రి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా మలక్‌పేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఆజం అలీ కూడా కిడ్ జీ స్కూల్‌లో ఓటు వేశారు. సెట్విన్ మాజీ చైర్మన్ మక్సూద్ అహ్మద్ న్యూ మలక్‌పేటలోని షోహెబ్ లైబ్రరీలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.



సలీంనగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో సతీ సమేతంగా ఓటు వేసిన త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి – మలక్‌పేట



సలీంనగర్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన బీఆర్‌ఎస్ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి – మలక్‌పేట



చార్మినార్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంఐఎం మలక్‌పేట అభ్యర్థి అహ్మద్ బిన్ అబ్దుల్ బలాల – సైదాబాద్



సలీంనగర్‌లోని సెంట్ డొమినిక్స్ ఉన్నత పాఠశాలలో ఓటు వేసినట్లు చూపుతున్న ఓటర్లు

### మూసారాంబాగ్, పాత మలక్‌పేట డివిజన్లలో

# ఓటు వేసేందుకు నిరాసక్తత

- 40 శాతంగా నమోదైన పోలింగ్

మలక్‌పేట, నవంబర్ 30 : మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం–58లోని మూసారాంబాగ్, పాత మలక్‌పేట డివిజన్లలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఎనిమిది గంటల వరకు పోలింగ్ మందకోడిగానే సాగడంతో 6.2 శాతంగా నమోదైంది. ఆ తర్వాత గంట గంటకు పుంజుకోవడంతో తొమ్మిది గంటలవరకు 8.2 శాతంగా, 11 గంటల వరకు 11.24 శాతం, మధ్యాహ్నం ఒంటిగంట వరకు 18.36 శాతం నమోదు కాగా, సాయంత్రం 3 గంటల వరకు 29.16 శాతం, 5 గంటల వరకు 40 శాతంగా నమోదైంది.

మూసారాంబాగ్, పాత మలక్‌పేట డివిజన్లలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం వరకు పోలింగ్ మందకోడిగా కొనసాగగా, కొన్ని కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. మూసారాంబాగ్ ఎస్‌బీఐ కాలనీ టీ జంక్షన్ చైతన్య పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం, వాహెద్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం, మున్సి;ల్ కాలనీలో, శంకర్‌నగర్, ప్రిన్స్ బాడీగార్డు లేన్‌లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని బూత్‌ల్లో ఓటు వేయటానికి ఓటర్లు ఆసక్తిని చూపకపోవటంతో వెలవెల బోయాయి. దాంతో మధ్యాహ్నం ఒంటి గంటవరకు 18.36 శాతంగా నమోదైన పోలింగ్, మూడు గంటలవరకు 29.16 శాతంగా నమోదైంది. చివరి గంటలో మహిళా ఓటర్లు బారులు తీరి ఓట్లు వేయడంతో ఐదు గంటలవరకు 36.9 శాతంగా నమోదైంది. 2014లో 52శాతం ఓట్లు పోలవ్వగా, 2018లో 9.4 శాతం పోలింగ్ పర్సంటేజ్ తగ్గి 42.3 శాతంగా నమోదైంది. ప్రస్తుత ఎన్నికల్లో మరో 2.6 శాతం పోలింగ్ తగ్గటంతో 40 శాతంగా నమోదైంది. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వృద్ధులను, వికలాంగులను వీల్‌చైర్లలో కూర్చోబెట్టి పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లారు. అయితే చాలామంది పేర్లు లిస్టుల్లో లేకపోవటం, ఐడీ ప్రూఫ్స్, పోల్ చిట్టీలు లేకుండా బూత్‌లకు రావడంతో అధికారులు లోనికి అనుమతించలేదు. కాగా అన్ని పోలింగ్ కేంద్రాలవ ద్ద కనిపించిన పరిస్థితులను బట్టి ఓట్లు వేసేందుకు మైనార్టీ మహిళలు చూపిన ఆసక్తి, ఇతర ఓటర్లు చూపించకపోవటంతో పోలింగ్ శాతం బాగా తగ్గినట్లు పలువురు పేర్కొంటున్నారు.



మూసారాంబాగ్‌లోని ఎస్‌బీఐ కాలనీలోని పోలింగ్ కేంద్రంలో ఓట్లు వేసేందుకు వచ్చిన ప్రజలు

### సలీంనగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

మూసారాంబాగ్ డివిజన్‌లోని పోలింగ్ కేంద్రాల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి సలీంనగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లోని 391 పోలింగ్ కేంద్రంలో సతీ సమేతంగా హాజరై ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

అదేవిధంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి సలీంనగర్‌లోని స్వామి వివేకానంద పాఠశాల–223 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోగా, హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్ దంపతులు న్యూ నో బుల్ కళాశాలలోని 249 పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను పోలీస్ బందోబస్తు మధ్య అంబర్‌పేటలోని డీఆర్‌సీ సెంటర్‌కు తరలించారు.